రోడ్డుపైనే మురుగు నీరు

- అసంపూర్తిగా డ్రైనేజీ నిర్మాణం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మడికొండ, జూలై 29 : గ్రేటర్ 64వ డివిజన్ పరిధిలోని మడికొండ టీఎన్జీవోస్ కాలనీలో అధికారులు అసంపూర్తిగా చేపట్టిన డ్రైనేజీ నిర్మాణంతో రోడ్డుపైనే మురుగు నీరు నిలుస్తున్నది. ఈ విషయమై కాలనీవాసులు తరచూ ప్రజా ప్రతినిధులు, అధికారులను కలిసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు నాలుగేళ్ల కిందట ప్రధాన రహదారి పక్కనే ఉన్న మురుగు నీటిని మళ్లించేందుకు మున్సిపల్ అధికారులు టీఎన్జీవోస్ కాలనీ వైపు డ్రైనేజీ నిర్మించారు. అయితే ఈ డ్రైనేజీని కాలనీ చివరి వరకు కాకుండా కొద్ది దూరం మాత్రమే నిర్మించి వదిలేశారు. దీంతో డ్రైనేజీ నుంచి వచ్చిన మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది. శ్రీసాయి ఆర్చిడ్ కాలనీ, శ్రీనగర్ కాలనీకి వెళ్లాలంటే ఈ మురుగునీటిని దాటే వెళ్లాలి. స్కూల్ పక్కనే డ్రైనేజీని వదిలేయడంతో పాకురు ఏర్పడి స్కూల్‌కు వెళ్లే చిన్నారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు పలు మార్లు కింద పడి గాయాలైన ఘటనలూ ఉన్నాయి. ఈ సమస్యపై కొన్నేళ్లుగా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం పడితే మురుగునీటి కాల్వ నుంచి వచ్చే నీటితో పాటు వర్షపు నీరు ఇళ్ల చుట్టూ చేరి దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు, విష పురుగులు వ్యాప్తి చెంది అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా నిర్మించిన డ్రైనేజీ నిర్మాణాన్ని కాలనీ చివరి వరకూ చేపట్టాలని వేడుకుంటున్నారు.

జారి పడకుండా చిన్నారులను తీసుకెళ్తున్న కాలనీ వాసులు

మురుగునీటి మీదుగా వెళ్తున్న విద్యార్థిని

మురుగు నీటితో తీవ్ర ఇబ్బందులు

డ్రైనేజీ అసంపూర్తిగా నిర్మించడం వల్ల రోడ్డుపై నిత్యం మురుగునీరు పారుతోంది. ఇంటి నుంచి బయటికి వెళ్లాలన్నా, తిరిగి రావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై పాకురు ఏర్పడడంతో పలువురు జారి పడ్డారు. చిన్నారులను స్కూల్‌కు తీసుకెళ్లి వచ్చేటప్పుడు వారిని జాగ్రత్తగా పట్టుకుని నడిపించాల్సిన పరిస్థితి వస్తున్నది. వర్షం పడితే మురుగునీరు ఇళ్లలోకి చేరుతోంది. ఈ సమస్యను పరిష్కరించాలి. – కొమురవెల్లి నరేశ్, స్థానికుడు

రోడ్డుపై లారీలకు అడ్డంగా బైఠాయించిన స్థానికులు

భారీ వాహనాలతో ఇబ్బందులు

- క్వారీ లీజును పునరుద్ధరించొద్దు
- రోడ్డుపై బైఠాయించిన స్థానికులు

మడికొండ, జూలై 29 : గ్రేటర్ 63వ డివిజన్ బృందావన కాలనీ వాసులు సమీపంలోని క్వారీ నుంచి వచ్చే భారీ వాహనాలను సోమవారం అడ్డుకున్నారు. భారీ వాహనాలు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తుంటే ఇబ్బందులు పడుతున్నామని, ఇదేంటని అడిగితే లారీ యజమానులు దౌర్జన్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ వాహనాలతో సీసీ రోడ్లు దెబ్బతిని గుంతలుగా మారుతున్నాయని, జన సంచారం నుంచి హెవీ గ్రానైట్ లారీలు వస్తుండడంతో ద్విచక్ర వాహనాలు, పాద చారులు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం క్వారీ లీజు ముగిసినా మళ్లీ ఇవ్వడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని, తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు కోరుతున్నారు.

విద్యార్థుల్లో లోపిస్తున్న క్రమశిక్షణ

బీసీటీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సాంబమూర్తి

సాంబమూర్తి

కాజీపేట, జూలై 29 : విద్యార్థుల్లో నానాటికి క్రమశిక్షణ లోపిస్తున్నదని బీసీటీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సాంబమూర్తి అన్నారు. ఖమ్మం జిల్లాలో విద్యార్థుల కటింగ్ నేపథ్యంపై జరిగిన ఘటనలో ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. 'ఆధునిక టెక్నాలజీ, సోషల్ మీడియాతో వారు పక్కదారి పడుతున్నారు. తల్లిదండ్రుల మాటలను వినడం లేదు సరికదా.. ఎదురు తిరుగుతున్నారు. ఫ్యాషన్ కటింగ్‌లతో బడికి వచ్చే విద్యార్థులను టీచర్లు ఇదేం కటింగ్ అని అడిగితే మా డాడీ దగ్గర ఉండి చేయించిండు సార్ అంటూ విద్యార్థులు బదులిస్తున్నారు. ప్రైవేట్ బడులకు పంపించే విద్యార్థుల తల్లిదండ్రుల తీరును ప్రభుత్వ బడులకు పంపించే విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలి'. తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు అండగా నిలబడినప్పుడే విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందుతుందన్నారు.

కేఎంసీలోని సమస్యలు పరిష్కరించాలి

నయీంనగర్, జూలై 29 : గోపాలపురం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంజీఎం, కేఎంసీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ క్యాంపస్ సమస్యలపై ఇన్‌చార్జి సూపరింటెంటెండ్ మురళికి వినతిపత్రం అందజేశారు. వివిధ విభాగాల్లో ప్రత్యేక వైద్య నిపుణుల సేవల కాల నిర్ణయ పట్టికను తెలియజేసే బోర్డులను అమర్చాలని, పత్రికల్లోనూ ప్రకటించడం ద్వారా రోగులు వారి వైద్య సేవలు పొందేందుకు అవకాశం ఉంటుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో యుగేంధర్, రవీందర్, మల్హార్‌రావ్ తదితరులు ఉన్నారు.

అమరధామం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్పీఆర్డీ ఇండియా నాయకులు

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

ఎన్పీఆర్డీ ఇండియా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్‌రావు

పరకాల, జూలై 29 : దివ్యాంగులను కించరిచేలా వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎన్పీఆర్డీ ఇండియా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాసాని నర్సింగరావు డిమాండ్ చేశారు. స్మితా సబర్వాల్ వ్యాఖ్యలను నిరసిస్తూ పట్టణంలోని అమరధామంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులను కించపరిచిన స్మితా సభర్వాల్‌పై దివ్యాంగుల హక్కుల చట్టం (2018), సెక్షన్ 92ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆమె దివ్యాంగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూదమల్ల ప్రశాంత్, బాధ్యులు గూడ కొమురయ్య, దొగ్గెల కుమారస్వామి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

వన్నాలను పరామర్శిస్తున్న బండా ప్రకాశ్

'వన్నాల'కు బండా ప్రకాశ్ పరామర్శ

న్యూశాయంపేట, జూలై 29 : వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములును మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు పరామర్శించారు. కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వన్నాలకు ఇటీవల శస్త్రచికిత్స చేశారు. వన్నాల వీలైనంత త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, RUMANA FATHIMA (New Name), previously called RUMAN FATIMA (Old Name), and residing at H.No. 25-8-441/1, Bapuji Nagar, Kazipet, Hanumakonda Dist.- 506003, T.S., India. and solemnly declare.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

ఎంజీఎం విభాగ ప్రతినిధులు

వరంగల్ చౌరస్తా, జూలై 29 : కార్మిక హక్కులను కాపాడుకోవడానికి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 4న చార్‌బౌళి పద్మశాలి కల్యాణ మండపంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య ఎంజీఎం విభాగం ప్రతినిధులు నాగరాజు, రాజు కోరారు. ఈ మేరకు సోమవారం సదస్సు కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంజీఎం దవాఖాన సెక్యూరిటీ, పేషెంట్ కేర్, శానిటేషన్ విభాగాల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం విజయభాను

మహాలక్ష్మి పథకంతో పెరిగిన ఆర్టీసీ ఆదాయం

- రూ.35 కోట్ల లాభం
- ఆర్టీసీ ఆర్ఎం విజయభాను

హనుమకొండ చౌరస్తా, జూలై 29 : ఆర్టీసీ డిసెంబర్ 9న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మీ పథకంతో ఆదాయం పెరిగిందని, రూ.35 కోట్ల లాభం చేకూరిందని ఆర్ఎం విజయభాను తెలిపారు. హనుమకొండ బస్‌స్టేషన్‌లోని ఆర్ఎం ఆఫీస్‌లో ఆయన మాట్లాడుతూ.. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల పరిధిలో మొత్తం 928 బస్సులు ఉండగా ఈ పథకం కింద 759 బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి రీజియన్‌లో 9.46 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించగా, వారిలో 5.78 లక్షల మంది మహిళలు(61 శాతం) స్కీమ్‌ను వినియోగించుకున్నట్లు చెప్పారు. ప్రయాణికులతో రద్దీ పెరిగిన దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రూట్లలో బస్సుల సంఖ్య, సమయాలను క్రమబద్ధీకరించినట్లు పేర్కొన్నారు. నూతనంగా సుమారు 20 రూట్లలో బస్సులను నడిపినట్లు తెలిపారు. పథకం ప్రారంభమైన తర్వాత వరంగల్ రీజియన్‌కు 105 కొత్త బస్సులు వచ్చాయని, ఇందులో 78 బస్సులు కాగా, మిగిలిన 27 నాన్ మహాలక్ష్మీ బస్సులను రీజియన్‌లోని వివిధ డిపోల్లో ప్రారంభించామన్నారు. రద్దీ పెరుగుతున్న దృష్ట్యా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అదనంగా 42 బస్సులు కావాలని ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. మొత్తం రూ.554.63 కోట్ల ఆదాయం రాగా, ఈ స్కీమ్ ప్రయాణికుల ద్వారా రూ.293.58 కోట్లు వచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఆర్ఎంలు మాధవరావు, భానుకిరణ్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు

వేలేరు, జూలై 29 : వేలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సోమవారం మండలంలోని పీచర శివారులోని వెంకటశ్రీ క్రషర్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి సుమారు 40మంది కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. కార్మికులకు బీపీ, షుగర్, వైరల్ ఫీవర్, డెంగీ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య, క్రషర్ సిబ్బంది వైశాలి, రవికిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

అంతరాష్ట్ర దొంగ అరెస్టు

మట్టెవాడ, జూలై 29 : అంతరాష్ట్ర దొంగను మట్టెవాడ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. యూపీకి చెందిన కృష్ణకాంత్ సక్సేనా గత నెల 22న జయ్‌పూర్‌లోని రిలీఫ్ రీలోకేషన్ పార్సిల్ సర్వీస్ ఆఫీసు నుంచి ఓ కారును మహారాష్ట్ర గోండియాకు డెలివరీ కోసం తీసుకుని జూన్ 20న వరంగల్‌కు వచ్చాడు. జూన్ 24 తెల్లవారుజామున హంటర్‌రోడ్డులోని హోస్వాన్ ఎలక్ట్రికల్ షాపు నుంచి సుమా రు రూ.2లక్షల విలువగల ఫినోలెక్స్ ఎలక్ట్రిక్ వైరును దొంగిలించాడు. షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, సీసీ కెమెరాలు పరిశీలించి శ్రీకాంత్ సక్సేనాను సోమవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి నేరం చేయడానికి ఉపయోగించిన రెండు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన ఎస్సై నవీన్‌కుమార్, ఐటీ కోర్ టీంను వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి అభినందించారు.

చోరీ నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

'నోట్లో బెల్లం, కంట్లో కారంగా కేంద్ర బడ్జెట్'

వరంగల్ చౌరస్తా, జూలై 29 : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజలకు నోట్లో బెల్లం పెట్టి, కంట్లో కారంకొట్టిన విధంగా ఉందని ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి అన్నారు. సోమవారం ఓంకార్ భవన్‌లో నిర్వహించిన పార్టీ హనుమకొండ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజల ప్రయోజనాల కంటే కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకే ప్రాధాన్యం కల్పించారన్నారు. వ్యవసాయరంగం, విద్యా వ్యవస్థకు తక్కువ నిధులు కేటాయించారని, వెంటనే ఆయాశాఖలకు నిధులు పెంచాలన్నారు. ఆర్ఎస్ఎస్‌లో ప్రభుత్వ ఉద్యోగులు చేరవచ్చని జారీ చేసిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టులకు నిధులు కేటాయించపోవడంతో పాటుగా జాతీయ రహదారుల విషయంలో సైతం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు హంసారెడ్డి, నీల రవీందర్, సావిత్రి, రాజిరెడ్డి, మొగిలి శ్రీనివాస్, ఇంద్రారెడ్డి, ఉస్మాన్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

కవి అంకయ్యకు నివాళి

హనుమకొండ చౌరస్తా, జూలై 29 : కవి, రచయిత, నాటకకర్త, అరుదైన వ్యక్తిత్వం గల బండారు అంకయ్య ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉద్యోగరీత్యా వరంగల్‌లో పని చేస్తున్న సమయంలో ప్రజాకవి కాళోజీతో ఆత్మీయ అనుబంధం కలిగిన అంకయ్య కవులు, రచయితలతో పాటు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను అద్భుతంగా నిర్వహించిన గొప్ప స్నేహశీలి అని అన్నారు. ఆయన జీవిత అనుభవాలను 'నాలో నేను' పేరుతో గ్రంథ రూపంలో వెలువరించి భావి రచయితలకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన మృతి సాహితీ లోకానికి తీరని లోటని, వరంగల్ సాహితీ ప్రపంచం ఒక మంచి మిత్రుడిని కోల్పోయిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నాగిళ్ల రామశాస్త్రి, వీఆర్ విద్యార్థి, ఆచార్య బన్న అయిలయ్య, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, పందిళ్ల అశోక్‌కుమార్, సిరాజుద్దీన్, ఆగపాటి రాజ్‌కుమార్ తదితరులు నివాళులర్పించారు.

రుద్రేశ్వరస్వామికి కదంబ పుష్పార్చన

కదంబపుష్పాల అలంకరణలో శివలింగం

హనుమకొండ చౌరస్తా, జూలై 29 : వేయి స్తంభాల రుద్రేశ్వరాలయంలో శివప్రీతికరమైన సోమవారం ఆషాఢ బహుళ నవమి వేళ ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. 100 మంది పుణ్యదంపతులు సామూహిక రుద్రాభిషేకంలో పాల్గొన్నట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో కదంబ వృక్షం నుంచి సేకరించిన పూలతో శివనామాలతో అర్చన నిర్వహించారు.

తపాలా సేవలపై అవగాహన

మడికొండ, జూలై 29 : గ్రేటర్ 44వ డివిజన్ భట్టుపల్లి గ్రామంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా హనుమకొండ ఉప తపాలా పర్యవేక్షకురాలు మూల రమాదేవి పోస్టాఫీసుకు సంబంధించిన పొదుపు పథకాలు, ప్రమాద బీమా, జీవిత బీమా పథకాలపై క్షుణ్ణంగా వివరించారు. తపాలా సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అవగాహన కల్పిస్తున్న రమాదేవి

అంధుల పాఠశాలలో అన్నదానం

పోచమ్మమైదాన్, జూలై 29 : వరంగల్ ఆటోనగర్‌లోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలలో యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. హనుమకొండకు చెందిన వంగ సుజాత–ప్రవీణ్‌కుమార్‌రెడ్డి దంపతుల కుమార్తె వామికారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులందరికీ భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో చల్లా అరుణ–ఇంద్రసేనారెడ్డి, చల్లా రోజ, రాధమ్మ, ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్‌కుమార్, కానిస్టేబుళ్లు కన్నె రాజు, బొట్టు కమలాకర్, కోలా రాజేశ్, ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ తీస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

బీఎస్ఎస్ఎల్ ఉద్యోగుల బైక్ ర్యాలీ

వరంగల్, జూలై 29 : వినియోగదారులను ఆకట్టుకునేందుకు బీఎస్ఎన్ఎస్ విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టింది. సోమవారం బీఎస్ఎన్ఎల్ భవన్ నుంచి పోచమ్మమైదాన్ వరకు ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్‌ను ప్రజలకు చేరువచేసేందుకు ర్యాలీ తీశామన్నారు. తక్కువ రేడియేషన్‌తో మెరుగైన నెట్‌వర్క్ బీఎస్ఎన్ఎల్ అని అన్నారు. త్వరలోనే 4జీ, 5జీ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. పేద, మధ్య తరగతి వినియోగదారులకు అందుబాటులో ఉండేలా ప్లాన్‌లు ఉన్నాయన్నారు.


బీసీ కాలనీలో రాత్రివేళ వెలగని సెంట్రల్ లైటింగ్ సిస్టమ్


తహసీల్దార్ కార్యాలయం ఎదుట పగలే వెలుగుతున్న సెంట్రల్ లైట్లు

ఇటు చీకట్లు.. అటు పగలే వెలుగులు

శాయంపేట, జూలై 29 : శాయంపేటలో ఓ పక్క రాత్రి సెంట్రల్ లైట్లు వెలగక చిమ్మచీకట్లు కమ్ముకుంటుంటే.. మరో పక్క పగలు కూడావీధి లైట్లు వెలుగుతున్నాయి. బస్టాండ్ సెంటర్ నుంచి బీసీ కాలనీ వరకు సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. పదిహేను రోజులుగా ప్రభుత్వ దవాఖాన నుంచి బీసీ కాలనీ వరకు సెంట్రల్ లైట్లు వెలగడం లేదని జీపీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెప్పారు. ఇదిలా ఉంటే తహసీల్ ఆఫీసు ముందున్న సెంట్రల్ లైట్లు కొన్ని రోజులుగా పగలు కూడా వెలుగుతున్నాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని, ఇప్పటికైనా సెంట్రల్ లైటింగ్ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీపీ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్

సుబేదారి, జూలై 29 : సైబర్ నేరగాళ్లు సోషల్‌మీడియాలో వరంగల్ సీపీ పేరుతో ఫేస్‌బుక్‌లో ఫేక్ అకౌంట్ ఓపెన్ చేసి, పలువురికి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపిస్తున్నారు. విషయం తెలుసుకున్న సీపీ అంబర్ కిశోర్ ఝా స్పందించారు. తన పేరుపై క్రియేట్ చేసిన నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి వస్తున్న ఫ్రెండ్ రిక్వెస్టులకు ఎవరూ స్పందించొద్దని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

హనుమకొండ చౌరస్తా, జూలై 29 : ఆర్టీసీ వరంగల్–1 డిపోలో ప్రయాణికుల సౌకర్యార్థం మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్ల ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు తెలుపవాలని, ఈ రూట్లలో సమస్యలు ఉంటే ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9959226047 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వెంకన్నను సన్మానిస్తున్న గోర్ బంజారా సంఘాల నాయకులు

బదిలీపై వెళ్తున్న సిటీ ప్లానర్‌కు సన్మానం

వరంగల్, జూలై 29 : బదిలీపై వెళ్తున్న బల్దియా సిటీ ప్లానర్ బానోత్ వెంకన్నను గ్రేటర్ వరంగల్ గోర్ బంజారా సంఘాలు సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికాయి. హనుమకొండలోని జీఎస్ కన్వెన్షన్ హాల్‌లో గోర్ బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బదావత్ బాలాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో డీసీపీ రాగ్యానాయక్, తహసీల్దార్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూల్‌సింగ్ చౌహాన్, గోర్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ కిరణ్, సిక్వాడీ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ కున్సోత్ హట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు హెచ్ఈవో రాజేంద్రప్రసాద్‌కు..

ఐనవోలు : బదిలీపై వెళ్తున్న మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ఈవోగా విధులు నిర్వర్తించిన రాజేంద్రప్రసాద్‌ను టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, అదే విధంగా బదిలీపై వెళ్తున్న ఏఎస్సై రమణారెడ్డి, కానిస్టేబుల్ నాగరాజును ఎస్సై పస్తం శ్రీనివాస్ సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మార్నేని రవీందర్‌రావు

బాధితులకు టెస్కాబ్ చైర్మన్ పరామర్శ

ఐనవోలు, జూలై 29 : బాధిత కుటుంబాలను టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన టీడీపీ నాయకుడు పల్లకొండ చిన్న మల్లయ్య గుండెనొప్పితో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మార్నేని ఆదివారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా ఎండీ గౌస్‌పాషా పెద్ద కుమారుడు అబ్దుల్ ఖాదిర్ ఇటీవల బ్లడ్ క్యాన్సర్‌తో మృతి చెందగా, మృతుడి కుటుంబ సభ్యులు పరామర్శించారు. నందనం సొసైటీ డైరెక్టర్ పల్లకొండ సమ్మయ్య అనారోగ్యంతో సమస్యతో బాధపడుతుండగా, ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఆలయ కమిటీ చైర్మన్ సంపత్‌కుమార్, మార్నేని రామారావు, మాజీ డైరెక్టర్ డబ్బా శ్రీను, మాజీ ఉప సర్పంచ్ సతీశ్‌కుమార్, సంపత్‌రావు, లక్ష్మణ్‌రావు, మాజీ వార్డు సభ్యుడు మహేందర్, నాయకులు సునీల్, భాస్కర్, సంపత్‌రెడ్డి, రమేశ్, రవీందర్, రాజయ్య, రమేశ్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ గ్రేటర్ అధికార ప్రతినిధిగా రమేశ్

నియామక పత్రాన్ని అందుకుంటున్న రమేశ్

హసన్‌పర్తి, జూలై 29 : మండలంలోని వంగపహాడ్ గ్రామానికి చెందిన గోనెల రమేశ్‌ను ముదిరాజ్ మహాసభ గ్రేటర్ వరంగల్ అధికార ప్రతినిధిగా నియమించారు. ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రంజిత్ సోమవారం రమేశ్‌కు నియామక పత్రం అందజేశారు. తనకు బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, బయ్య స్వామికి రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ టవర్ ఎక్కిన యువకుడు

కాశీబుగ్గ, జూలై 29 : గ్రేటర్ 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌కు చెందిన యువకుడు కుదురుపాక జయప్రకాశ్ సోమవారం విద్యుత్ టవర్ ఎక్కి ఆందోళన చేశాడు. ఎస్ఆర్‌నగర్‌కు చెందిన కురుదుపాక వెంకటేశ్వర్లు(కేవీ స్వామి), అతడి బంధువులకు మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో పంచాయితీలు జరుగుతున్నాయి. వెంకటేశ్వర్లు తమ బంధువులకు డబ్బులు ఇవ్వాల్సిందిగా తేలింది. అయినా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుండడంతో రంగశాయిపేటకు చెందిన వారు మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటేశ్వర్లును స్టేషన్‌కు రావాలని పోలీసులు అదేశించారు. దీంతో అతడి కుమారుడు జయప్రకాశ్ ఎనుమాములలోని సబ్ స్టేషన్ పక్కన గల టవర్ ఎక్కి పోలీసులు తన తండ్రిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళనకు దిగాడు. సీఐ రమేశ్ గౌడ్ అతడికి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇవ్వడంతో టవర్ దిగాడు. అలాగే, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు.

డీఎంఈ బాధ్యతల స్వీకరణ

కాజీపేట, జూలై 29 : కాజీపేట రైల్వే డీజిల్ లోకో షెడ్ సీనియర్ డీఎంఈగా పీవీ వెంకట్ కుమార్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. పీవీ వెంకట్ కుమార్ ఇంతకుముందు హైదరాబాద్ రైల్వే డివిజన్ సీనియర్ డీఎస్‌వోగా విధులు నిర్వర్తించారు. రైల్వే ఉన్నతాధికారులు ఆయనకు సీనియర్ డీఎంఈగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కాజీపేటకు బదిలీ చేశారు. గతంలో కాజీపేట సీనియర్ డీఎంఈగా విధులు నిర్వర్తించిన స్వరాజ్‌కుమార్‌ను రైల్వే అధికారులు సికింద్రాబాద్ రైల్ నిలయం డిప్యూటీ సీఎస్‌వోగా ఉద్యోగోన్నతి కల్పించి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన సీనియర్ డీఎంఈ వెంకట్ కుమార్‌కు, బదిలీపై వెళ్తున్న స్వరాజ్ కుమార్‌కు షెడ్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఇద్దరి అధికారులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు, వీడ్కోలు పలికారు.

వెంకట్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు